సాక్షి
బాపట్ల

మంగళవారం, 15, అక్టోబర్, 2024



కాళీమాత ఊరేగింపు

తెనాలి: స్థానిక శివాజీ చౌక్‌లోని శ్రీకాళీమాత దేవస్థానంలో దేవీ శర్నవరాత్రుల ముగింపు సందర్భంగా సోమవారం పుర వీధుల్లో అమ్మవారి విగ్రహ ఊరేగింపును నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట:పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 33,516 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,225 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 3,371 క్యూసెక్కులు వదిలారు.

సిండికేటులదే లక్కు

- పిట్టలవానిపాలెంలో ఒకే కుటుంబంలో ఐదుగురికి దక్కిన షాపులు
- ఏడుగురికి రెండేసి చొప్పన
- రేపల్లెలో ముగ్గురికి రెండేసి
- చీరాల, కొరిశపాడుల్లో ఇద్దరికి రెండేసి దుకాణాలు
- పచ్చనేతల పెత్తనం
- జిల్లాలో సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- ఐదుగురు మహిళలకు ఆరు మద్యం దుకాణాలు
- సిండికేట్‌లో లేనివారికి దక్కని దుకాణాలు
- తరలివచ్చిన దరఖాస్తుదారులు
- భారీగా పోలీసు బందోబస్తు

జిల్లాలో ముగిసిన మద్యం దుకాణాల లాటరీ



లాటరీ తీస్తున్న కలెక్టర్ వెంకట మురళి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలోని అత్యధిక మద్యం దుకాణాలను పచ్చనేతలే దక్కించుకున్నారు. సోమవారం జరిగిన లాటరీలో సిండికేట్ తీవ్ర ప్రభావం చూపింది. సిండికేట్‌లో లేని వారు పదుల సంఖ్యలో దరఖాస్తులు వేసినా ఒక్క దుకాణం కూడా లభించలేదు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే జిల్లా కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్‌లు స్థానిక ఎంఎస్సార్ కల్యాణ మండపంలో మద్యం షాపులకు లాటరీ నిర్వహించారు. బాపట్ల, వేమూరు, చీరాల, పర్చూరు, రేపల్లె, అద్దంకిలకు వేర్వేరు కౌంటర్లు పెట్టి లాటరీ నిర్వహించడంతో మధ్యాహ్నం సమయానికే లాటరీ ప్రక్రియ ముగిసింది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు వేసిన వారు పెద్దఎత్తున తరలి రావడంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

- మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత నియోజకవర్గం రేపల్లెలో సిండికేట్ తీవ్ర ప్రభావం చూపించింది. ఇక్కడ పచ్చ నేతలు తాము ఎంపిక చేసుకున్న వారిని మినహా మిగిలిన వారిని దరఖాస్తులు వేయనీయలేదు. దీంతో వారు అనుకున్న తరహాలో లాటరీలో దుకాణాలు దక్కాయి. రేపల్లె రూరల్‌లో అంజయ్యగౌడ్ అనే వ్యక్తికి 37, 38 నంబర్ల దుకాణాలు దక్కగా నిజాంపట్నం మండలంలో మోపిదేవి చంద్రకళకు 48, 49 నంబర్ల దుకాణాలు, చెరుకుపల్లె మండలంలో అనిల్‌కుమార్ అనే వ్యక్తికి 52, 53 నంబర్ల దుకాణాలు దక్కగా బాపట్ల నియోజకవర్గంలోనూ ఇక్కడి పచ్చనేత నెలకొల్పిన సిండికేట్ ప్రభావం చూపించింది. పిట్టలవానిపాలెం మండలంలో పచ్చనేత సామాజికవర్గానికి చెందిన ఒకే కుటుంబానికి ఐదు మద్యం దుకాణాలు దక్కాయి. మండలానికి చెందిన గోకరాజు శ్రీధరవర్మకు 28, 30 నంబర్ల మద్యం దుకాణాలు రాగా రామకృష్ణంరాజుకు బాపట్ల పట్టణంలో 3వ నంబర్ దుకాణంతోపాటు కర్లపాలెంలో 34వ నంబర్ షాపు దక్కింది. ఇదే కుటుంబంలోని యుధిష్టర్‌వర్మ పేరున బాపట్ల పట్టణంలో 6వ నంబర్ దుకాణం దక్కింది.
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలో సిండికేట్ల ప్రభావం కనిపించింది. కొరిశపాడు మండలంలో సుబ్బారావు అనే వ్యక్తికి మండలంలో 93, 91 నంబర్ల మద్యం దుకాణాలు లభించాయి.
- చీరాల నియోజకవర్గంలోనూ పచ్చ సిండికేట్ తన ప్రభావం చూపించడంతో ఇక్కడ బాలకృష్ణ అనే వ్యక్తికి చీరాల పట్టణంలో 9, వేటపాలెంలో 84 నంబర్ల దుకాణాలు దక్కాయి.

ఐదుగురు మహిళలకు చాన్స్

సోమవారం 117 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్ జైన్‌లు లాటరీ తీయగా ఇందులో ఐదుగురు మహిళలకు 6 మద్యం దుకాణాలు దక్కాయి. నిజాంపట్నం మండలంలో మోపిదేవి చంద్రకళకు 48, 49 నంబర్ల దుకాణాలు దక్కగా బాపట్ల పట్టణానికి చెందిన ఐ.అరుణ,(5వ నంబర్‌షాపు) చీరాలకు చెందిన ఇంటూరి శివ కుమారి (8), కర్లపాలెంకు చెందిన లావు సునీత (33), సంతమాగులూరుకు చెందిన కె.తులసి(95)లకు మద్యం దుకాణాలు దక్కాయి. తులసి ప్రస్తుతం చార్టెడ్ అకౌంటెంట్ చివరి సంవత్సరం చదువుతున్నారు.

సిండికేట్‌లో లేని వారికి నిరాశే

మద్యం దుకాణాలు కొందరికి లాటరీలో దక్కినా పచ్చనేతల ఒత్తిళ్లతో వారు సిండికేట్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీలో ఉన్నా .. పచ్చ ప్రజాప్రతినిధులను వ్యతిరేకించి సొంతంగా దరఖాస్తులు వేసిన వారికి ఒక్క దుకాణం దక్కలేదు. ఉదాహరణకు స్థానిక ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తున్న బాపట్లకు చెందిన నేత తన అనుచరులతో కలిసి సుమారు 30 దరఖాస్తులు వేసినా ఒక్క దుకాణం రాలేదు. సిండికేట్‌ను వ్యతిరేకించి దరఖాస్తుల వేసిన చాలామందికి మద్యం దుకాణాలు దక్కలేదని తెలుస్తోంది.



మద్యం దుకాణాల టెండర్లలో పాల్గొన్న మద్యం వ్యాపారులు

శ్మశాన భూములు లేని కాలనీలను గుర్తించండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: శ్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. సమాజంలో అన్నింటిలోనూ వెనుకబడిన ఎస్సీ, ఎస్టీలను గుర్తించి వారి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌పై అధిక ప్రాధాన్యం చూపాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. నేటికీ ఆధార్ కార్డులేని ఎస్టీలను గుర్తించి తక్షణమే ఆధార్ కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 124, తూర్పు కెనాల్‌కు 80, పశ్చిమ కెనాల్‌కు 69, నిజాంపట్నం కాలువకు 130 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

21న మేరుగ ప్రమాణస్వీకారం

బాపట్లటౌన్ : బాపట్ల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన మాజీ మంత్రి మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారం ఈనెల 21న పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

వేగం షార్ట్ ఫిలిమ్ సీడీ ఆవిష్కరణ



బల్లికురవ: బల్లికురవ మండలం కొప్పెరపాడుకు చెందిన దమ్ము ఏడుకొండలు నిర్మించిన వేగం షార్ట్ ఫిలిమ్‌ను సీడీని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సంతమాగులూరు మండలంలోని అడ్డరోడ్‌లో అతిథి గృహంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ యువకులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో దర్శకుడు వీ.వెంకట్, నిర్మాత దమ్ము ఏడుకొండలు గ్రామస్తులు గుర్రాల శ్రీనివాసరావు, దమ్ము ఆంజనేయులు, దమ్ము అంజయ్య పాల్గొన్నారు.

మల్లేశ్వరుని సేవలో ఐజీ రామకృష్ణ




పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఐజీ పి.హెచ్.డి. రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఐజీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఉప కమిషనర్ స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, చిత్రపటం బహూకరించారు.

17 నుంచి రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : స్థానిక బీఆర్ స్టేడియంలో ఈ నెల 17 నుంచి 19 వరకు జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎస్.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్‌ల విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ అఫ్రోజ్ ఖాన్ నంబర్ 8143143222ను సంప్రదించాలని సూచించారు.

పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు



అమరావతి:అమరావతిలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి శ్రీ దేవీ శరన్నవ రాత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత చండీదేవి సమేత అమరేశ్వరస్వామి వారికి నంది మండపంలో చూర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరువంజనం చేసి నూతన వస్త్రాలంకరణ చేసి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ పంచాహ్నిక దీక్షతో నిర్వహించే దసరా ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంతసేవ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వసంతోత్సవం అనంతరం స్వామివారిని పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- 18 వరకు కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- బలంగా వీస్తున్న ఈదురుగాలులు
- నాలుగురోజుల వరకు వేటకు వెళ్ల వద్దంటూ మత్స్యకారులకు ఆదేశాలు
- జిల్లాలో సగటున 14.5 మీ.మీ వర్షపాతం నమోదు



సూర్యలంక తీరంలో ఎగసిపడుతున్న అలలు

బాపట్లటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ఉధృతికి లంక గ్రామాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో అత్యధికంగా చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అమర్తలూరులో అత్యల్పంగా 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆందోళనలో అన్నదాతలు

మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా నష్టపోయారు. ఆ నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో అల్పపీడనం ఏర్పడి జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు భయాందోళనకు గురౌతున్నారు. ప్రస్తుతం వరిసాగు పొట్ట, పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో వర్షాలు కురవడం వలన గింజ తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

తీరానికి చేరిన పడవలు

అల్పపీడనం కారణంగా తీరంలో సుమారు మూడు మీటర్ల మేర అలలు ఎగిసిపడుతున్నాయి. తీర ప్రాంతాల్లో గంటకు 55 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అప్రమత్తమైన క్షేత్రస్థాయి మత్స్యశాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులను వేటకు వెళ్లకుండా నిలుపుదల చేశారు. నాలుగైదు రోజుల కిందట వేటకు వెళ్లి ఇప్పటికీ సముద్రంలో ఉన్న మత్స్యకారులను వెనక్కి పిలిచే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలోని నిజాంపట్నం, ఈపూరుపాలెంలలో సుమారు 200 పడవలకు లంగర్‌వేశారు. ఈనెల 18 వరకు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

జిల్లాలో వర్షపాతం నమోదు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 361.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చిన్నగంజాంలో 34.6మి.మీటర్లు, చుండూరు 3.8 మి.మీ, అమర్తలూరు 2.0, వేమూరు 17.8, కొల్లూరు 10.2, భట్టిప్రోలు 32.2, చెరుకుపల్లి 25.2, పిట్టలవానిపాలెం 15.6, కర్లపాలెం 26.4, బాపట్ల 22.8, నిజాంపట్నం 10.8, నగరం 24.2, రేపల్లె 20.2, సంతమాగులూరు 6.2, బల్లికురవ 2.6, మార్టూరు 14.4, యద్దనపూడి 6.6, పర్చూరు 9.6, కారంచేడు 10.2, ఇంకొల్లు 22.4, జె.పంగులూరు 2.0, అద్దంకి 5.4, కొరిశపాడు 6.2, చీరాల 9.6, వేటపాలెం 20.4 మి.మీటర్ల వర్షం కురిసింది.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం



తీరానికి చేరిన పడవలు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఆర్డీవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో మత్స్యకారులు వేటకు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని చెప్పారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే వెనుకకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సాగర్ మిత్రలకు తక్షణమే సమాచారం పంపాలన్నారు. సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను చీరాల, బాపట్లలో ఉంచాలని డీఆర్‌ఓను ఆదేశించారు. 19వ తేదీ వరకు అధికారులు, ఉద్యోగులు సెలవులు పెట్టరాదని, ఇప్పటికే సెలవుల్లో ఉంటే వారి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. చెరువులు, కాల్వల గట్లు బలహీనంగా ఉండి గండ్లు పడే ప్రాంతాలను జల వనరులశాఖ అధికారులు గుర్తించాలన్నారు. సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా లేదా శాశ్వత మరమ్మతు పనులపై అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం

వాతావరణంలో వచ్చినమార్పుల కారణంగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా వైద్యశాలకు చేరుకోవాలి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

–ఎస్.విజయలక్ష్మి,
డీఎంఅండ్‌హెచ్‌వో, బాపట్ల జిల్లా

ఆద్యంతం.. అవస్థలమయం

- దుర్గమ్మ చెంత సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు
- దసరా ఉత్సవాల నిర్వహణలో శాఖల మధ్య సమన్వయ లోపం
- తీరుమారని పోలీసులు
- అర్చకులు, ఆలయ సిబ్బందికీ తప్పని పాట్లు
- గుట్టలపై చెట్లను పట్టుకొని దర్శనానికి వెళ్లిన భవానీలు



విజయదశమి రోజున చెట్ల మధ్య నుంచి దుర్గమ్మ కొండపైకి ఎక్కుతున్న భవానీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి శరన్నవరాత్రి ఉత్సవాలలో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయలోపంతో అమ్మవారి దర్శనానికి అవస్థలు పడ్డారు. ఆలయ అర్చకులు, ఇంజినీరింగ్ సిబ్బంది, కళాకారులతో పోలీసులు వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీలపై వచ్చిన అధికారులకు గతంలో దసరా ఉత్సవాలలో విధులు నిర్వర్తించిన అనుభవం లేకపోవడం కూడా తీవ్రంగా ప్రభావం చూపింది. ఉత్సవాలు ప్రశాంతంగా ముగుస్తున్నాయనే తరుణంలో దశమి రోజున రద్దీ ఆందోళనలను కలిగించింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో కూటమి ప్రభుత్వం వీఐపీల పేరిట జారీ చేసిన టికెట్ల దేవస్థాన ఆదాయానికి భారీ గండి కొట్టింది. దీనికి తోడు సేవా కమిటీ పేరిట 56 మంది సభ్యులు తమ బంధుగణానికి ఇష్టానుసారంగా దర్శనాలు చేయించడం విమర్శలకు తావిచ్చింది.

సమీక్షలు ఎందుకు?

ఉత్సవాలలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది విధులలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని పోలీసు, రెవెన్యూ శాఖలు నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిర్ణయించాయి. ఉత్సవాలకు కొద్ది రోజుల ముందు ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులకు అనుభవం లేకపోవడం కొన్ని సమస్యలకు కారణమైంది. కీలక ప్రాంతాల్లో ఇలా బదిలీపై వచ్చిన అధికారులకు విధులు కేటాయించడం కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ఈ ఏడాది కూడా అర్చకులను విధుల్లోకి రాకుండా అడ్డుకోవడం, ఇంజినీరింగ్ సిబ్బందితో వివాదాలు యథావిధిగానే కొనసాగాయి. వాస్తవానికి పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్వహించే సమీక్ష సమావేశానికి ఉన్నత స్థాయిలో ఉండే అధికారులే హాజరవుతారు. కానీ కింది స్థాయి సిబ్బందికి ఆ నిర్ణయాలు పట్టకుండా పోయింది.

జంబో సేవా కమిటీ

దసరా ఉత్సవాలలో ఎన్నడూ లేని విధంగా 56 మందితో కూటమి ప్రభుత్వం సేవా కమిటీని నియమించింది. అధికార మూడు పార్టీలకు చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన ఈ కమిటీ సభ్యులలో ఎక్కువ మంది తమ బంధుగణానికి అమ్మవారి దర్శనం చేయించడంలోనే తరించారు.

యథావిధిగానే రేషన్‌పై లడ్డూలు..

ఈఏడాది భవానీలకు కోరినన్ని లడ్డూలను ఇవ్వాలనే భావనతో ఉత్సవాలలో 25 లక్షల లడ్డూలను తయారు చేయాలని దేవస్థానం నిర్ణయించింది. ఉత్సవాల తొలి 5 రోజులు భక్తుల సంఖ్య అనుకున్నంతగా లేకపోవడంతో లడ్డూ తయారీని నిలిపివేసింది. ఇదే సమయంలో మూలానక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దేవస్థానం ఉచితంగా లడ్డూ అందజేస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. మరో వైపున పున్నమి ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి భారీగా అమ్మవారి లడ్డూలను పంపిణీ చేశారు. దేవస్థానం వద్ద ఉన్న నిల్వలు భారీగా తగ్గడం, ఆ ప్రభావం ఆదివారం, సోమవారం పడింది. ప్రతి ఒక్క భక్తుడికి, భవానీకి నాలుగు లడ్డూలనే ఇవ్వాలని నిర్ణయించింది. ఇది అమలు కాలేదు.

రెండు నెలల్లో రెండు ఉద్యోగాలు

- తెలంగాణ డీఎస్సీలో టాపర్‌గా నిలిచిన రెంటచింతల యువకుడు
- సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్న బాషా



రెంటచింతల: రెంటచింతలకు చెందిన షేక్ అలీం బాషా హిందీ పండిట్‌గా పనిచేస్తూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో నల్గొండ జిల్లా స్థాయిలో హిందీలో మొదటి ర్యాంక్ సాధించి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచాడు. గ్రామంలోని సుబ్బన్నతోట కాలనీకి చెందిన అలీం బాషా గత ఆగస్టు నెలలో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పాఠశాలలో హిందీ పండిట్‌గా ఉపాధ్యాయ వృత్తిలో చేరాడు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీకి నాన్‌లోకల్ కోటాలో నల్గొండ జిల్లాలో ప్రవేశ పరీక్ష రాశాడు. హిందీలో మొదటి ర్యాంక్ సాధించి నల్గొండ జిల్లా టాపర్‌గా నిలిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. మంగళవారం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో పాఠశాల కేటాయిస్తారని అలీం బాషా తెలిపాడు. రెండు నెలల వ్యవధిలో రెండు ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అలీం బాషా నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచారు.

క్లుప్తంగా

రేపటి నుంచి నూతన మద్యం దుకాణాల్లో విక్రయాలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్



నగరం: నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 12 మద్యం షాపుల టెండర్లను లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు సీఐ శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం స్టేషన్ పరిధిలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలలోని 12 మద్యం షాపు టెండర్లుకు 179 దరఖాస్తులు వచ్చాయన్నారు. టెండర్ల లాటరీలో 12 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 16 నుంచి మద్యం షాపులలో విక్రయాలు జరుగుతాయన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు ఎంపిక



రంగ మహాలక్ష్మీ

నరసరావుపేట రూరల్: శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి సోమవారం తెలిపారు. ఈనెల 5వ తేదీన ప్రకాశం జిల్లా జే.పంగులూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థి డి.రంగమహా లక్ష్మీ ప్రతిభ కనబర్చి అండర్-18 విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికై నట్టు వివరించారు. ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరు ఏసీ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు. తమిళనాడు కోయంబత్తూర్‌లో ఈనెల 16వ తేదీ నుంచి సౌత్‌జోన్ జాతీయ స్థాయి ఖేల్ ఇండియా ఖోఖో టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టుకు రంగమహాలక్ష్మీ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికై న విద్యార్థినిని వ్యాయమ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, షేక్ ఫాతిమా, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అల్పపీడనం.. అధిక ప్రభావం

- భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన నారుమళ్లు, పైర్లు
- చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షం

సాక్షినెట్ వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అల్పపీడనం కారణంగా కురిసిన వర్షంతో పర్చూరు, చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో పలు వీధులు జలమయం అయ్యాయి. రోడ్ల మీద వర్షపు నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీరాల పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి రోడ్డులో మోకాలు లోతులో వర్షపునీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేటపాలెం మండలంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు రైతులను నిండా ముంచాయి. వరి పంట సాగు కోసం కొంత మంది రైతులు నారుమడులు, మరి కొంతమంది నాట్లు వేశారు. అయితే ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నారుమళ్లు వర్షం నీటిలో మునిగాయి. ఇసుక భూముల్లో సాగు చేసిన మినిము పైరు కోసి ఓదెల మీద ఉండటంతో వర్షానికి పూర్తిగా తడిసిపోయింది.



వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ

చినగంజాంలో అత్యధిక వర్షపాతం..

తుఫాన్ కారణంగా బాపట్ల జిల్లాలో అత్యధికంగా చినగంజాం మండలంలో 34.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో నీరు వచ్చి చేరింది. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పర్చూరు మండలం పూసపాడు వద్ద కప్పలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగుపై ప్రమాదకరంగా వెళుతున్న ఆటో



సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



వర్షానికి తడిసిన ఓదెల మీద ఉన్న మినుము పైరు

‘పల్లె పండుగ’ను జయప్రదం చేయండి

జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

బాపట్ల: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు విస్తృతమైన ప్రచారం చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో రూ.88 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పంచాయతీ శాఖ ద్వారా కొన్ని పనులు జరుగుతుండగా, మరికొన్ని పనులు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్మశాన వాటికలు, మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, వసతి గృహాల, పాఠశాలల ప్రహరీలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఏయే గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టారో అనే అంశాలపై ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రచార బోర్డుపై పీఎం, సీఎం, డెప్యూటీ సీఎం ఫొటోలను ఉంచాలన్నారు. భూమి పూజ చేసిన తదుపరి కార్యక్రమం ఫొటోలను సంబంధిత యాప్‌లో నిక్షేత్రం చేయాలన్నారు. 454 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రతి పంచాయతీలో నిర్వహించే కార్యక్రమాలను జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాలలో విధిగా ప్రొటోకాల్ పాటించాలన్నారు. డ్వామా పీడీ విజయలక్ష్మీ, పీఆర్ ఎస్ఈ హరేరామ కృష్ణ, డీపీఓ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- సిబ్బందికి జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ సూచన
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 29 అర్జీలు స్వీకరణ

బాపట్లటౌన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 29 మంది అర్జీదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను ఎస్పీకు వివరించారు. ముఖ్యంగా కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక మోసాలు, భూవివాదాలపై పలు ఫిర్యాదులు అందాయి. ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి అర్జీలను వేగవంతంగా విచారించి చట్టపరిధిలో నిర్ణిత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, సీఐ యు.శ్రీనివాసులు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

రోడ్లు వేస్తేనే పల్లె పండుగా ?

- ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి
- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్



చినగంజాం: కూటమి ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా నెరవేర్చి పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టాలే గాని కేవలం ఒక్క రోడ్లు వేస్తేనే పల్లె పండుగ వస్తుందా అని మాలమహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఒక ప్రకటనలో విమర్శించారు. తల్లికి వందనం పథకంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, అన్నదాత సుఖీభవ కింద ప్రతి ఎకరానికి రూ.20 వేలు, మత్స్యకార భరోసా సంవత్సరానికి రూ.20 వేలు, 50 ఏళ్లు దాటిన ప్రతి బీసీకి పెన్షన్, నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రతి నెల నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ప్రతి మహిళకు ఉచిత బస్సు సౌకర్యం, వలంటీర్లకు ప్రతి నెల రూ.10 వేలు, అర్హులైన ప్రతి పేదవానికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ఉచిత ఇసుక, ఇటువంటి హామీలన్నీ నెరవేరిస్తేనే పల్లెల్లో పండుగ వస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు పల్లెలు పండుగ జరుపుకోలేదా అని ఆయన ప్రశ్నించారు. మద్యం ధరలు తగ్గించి, నిత్యావసర ధరలు పెంచి పల్లె పండుగు చేసుకోవాలా అని ఆయన ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అని మతాల మధ్య, కులాల మధ్య వైషమ్యాలు సృష్టించి వారి మధ్య చిచ్చు పెట్టి ప్రజలను ఏమార్చటం ఎంతవరకు సమంజసమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చక పోతే ప్రజలు తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని ఆయన హెచ్చరించారు.

మంగళగిరి కోర్టును ఆశ్రయించిన ముంబై పోలీసులు

తాడేపల్లి రూరల్ : ముంబై పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టును ఆశ్రయించారు. వస్త్రాల దొంగతనం కేసులో పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరిని ముంబై తీసుకువెళ్లేందుకు అనుమతి తీసుకున్నారు. వివరాలు.. ముంబైలో గత నెల 30వ తేదీ ఓ వస్త్ర దుకాణంలో కొందరు దుస్తులతో పాటు బంగారాన్ని చోరీ చేశారు. ఈ దొంగతనం చేసింది గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన వారిగా గుర్తించి ఇక్కడకు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ముంబై పోలీసులు మూడు రోజుల పాటు తాడేపల్లిలో ఉండి వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి వారిలో ప్రసాద్, కుమార్, శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. ఇందులో శ్రీకాంత్‌కు సంబంధం లేకపోవడంతో అతడ్ని వదిలివేశారు. పట్టుబడిన ఇద్దరిని 24 గంటల్లో కోర్టులో హాజరు పరచాల్సి ఉంది. ఇక్కడి నుంచి ముంబై వెళ్లేందుకు సమయం సరిపోదని ముందుగానే మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు.

టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేఎన్‌పీఎస్, ప్రజాసంఘాల నాయకులు, బాధితులు

- బాధితులపై పెట్టిన కేసును రద్దు చేయాలి
- రెడ్‌బుక్‌కు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి
- కలెక్టరేట్ ఎదుట ధర్నాచేసిన ప్రజాసంఘాల నాయకులు
- జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేత

నరసరావుపేట: పెదకూరపాడు మండలం లగడపాడులో గతనెల 9వ తేదీన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా పల్లె యువకులు యర్రగొర్ల నరసింహారావు, పల్లం ఏసుపాదంలపై దాడులకు పాల్పడిన టీడీపీ నాయకులు రావెల మనేష్, బుచ్చయ్యచౌదరి అండ్ గ్యాంగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత యువకులు 17 మందిపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ధర్నాచేసి కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావులకు వినతిపత్రాలు అందజేశారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో దళిత పల్లెల ప్రజలపై అమలౌతున్న అధికార పార్టీ రెడ్‌బుక్ (దాడులు, దౌర్జన్యాలు కక్షసాధింపు చర్యలు) రాజ్యాంగానికి వ్యతిరేకంగా బాధిత గ్రామాల ప్రజలు సంఘటితంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. అధికార మదంతో మాల, మాదిగ పల్లెలపై టీడీపీకి చెందిన వ్యక్తులు దాడులు చేస్తున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో పోలీసు అధికారులపై ఒత్తిడి పెంచి బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దళిత యువకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి బాధితులపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, కులనిర్మూలనా పోరాట సమితి ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్. రాజశేఖర్, నాగి పోగు శ్రీను, ఖాశీం, రాపూరి రవి పాల్గొన్నారు.

పాత కక్షలతో వ్యక్తిపై కత్తితో దాడి

బెల్లంకొండ: పాత కక్షలతో వ్యక్తిపై మరొక వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజా కథనం ప్రకారం గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బండారు తులశీరావు అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడాది వీరి మధ్య ఓ విషయంలో వివాదంతో తలెత్తడంతో అశోక్ గత కొన్ని నెలల క్రితం తులశీరావుపై కత్తితో దాడికి చేశాడు. ఈ ఘటనలో తులశీరావుకు స్వల్పగాయాలయ్యాయి. వీరిద్దరిపై గతంలో కౌంటర్ కేసులు నమోదయ్యాయి. కాగా పాత కక్షలతో శనివారం రాత్రి తులశీరావు తిరిగి అశోక్‌పై దాడికి యత్నించాడు. బజారుకు వచ్చిన అశోక్‌పై కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో అశోక్ కు గొంతు భాగంలో గాయాలయ్యాయి. గాయపడిన బాధితుడిని వెంటనే కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తీసుకువెళ్లినట్లు తెలిసింది. కాగా ఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు తులసీరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ రాజా పేర్కొన్నారు.

సత్తెనపల్లిలో మహిళ పై హత్యాయత్నం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ప్రియురాలు కనిపించకుండా పోయిందనే అక్కసుతో ప్రియురాలి తల్లిపై కత్తితో హత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన పట్టణంలోని 2వ వార్డులో సోమవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 2వ వార్డు15వ లైనుకు చెందిన రావినూతల కరుణమ్మ కు నలుగురు కుమార్తెలు. వారిలో రెండవ కుమార్తె భారతికి 17వ వార్డు, సుందరయ్యకాలనీకి చెందిన పీ.పూర్ణచంద్రరావు కు మధ్య రెండేళ్ళుగా వివాహేతర సంబంధం నెలకొంది. ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి భారతి కనిపించకుండా పోవటంతో పూర్ణచంద్రరావు 2 వార్డులో ఉంటున్న కరుణమ్మ ఇంటికి వెళ్ళి నీ కూతుర్ని ఎక్కడ దాచి పెట్టావు అంటూ మంచం పై నిద్రిస్తున్న మహిళ పై కత్తితో దాడి చేశాడు. దాడిలో కరుణమ్మ తలకు, కుడిచేతిపై, ఎడం చేతిపై, పొట్టపై బలమైన గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గతంలోను కరుణమ్మ పై పూర్ణచంద్రరావు చేసిన దాడిలో కుడి చేయి విరిగింది. అనంతరం ఇరువురు రాజీ చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి, బాధితురాలి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. జరిగిన సంఘటనపై కరుణమ్మ ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరుణమ్మ

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పిడుగురాళ్ల: ఆటోను వేగంగా బస్సు ఢీకొనటంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణ సమీపంలోని అయ్యప్పనగర్ సమీపంలోని పెద్ద కాలువ సమీపంలో జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు... పట్టణ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఆటో బ్రాహ్మణపల్లి వైపు యూటర్న్ తీసుకుంటుండగా పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కందుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వేగంగా ఆటోను ఢీకొనటంతో ఆటో నడుపుతున్న బ్రహ్మణపల్లి గ్రామానికి మల్లబంటు లక్ష్మయ్య (40) అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ ఎం మోహన్ సంఘటనా స్థలాన్ని చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఆటోలో ప్రయాణికులు ఎవరు లేకపోవటంతో ఆటో డ్రైవర్ మాత్రమే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఎన్‌జీ రంగా సాహిత్య పురస్కారం విజేతలు వీరే..

నగరంపాలెం: ఆచార్య ఎన్‌జీ రంగా ఫౌండేషన్ - 2024 సాహిత్య పురస్కారాల ఎంపిక పూర్తయినట్లు అధ్యక్షులు డాక్టర్ జిక్కంపూడి సీతారామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని రచయిత్రుల నుంచి నవలను ఇటీవల ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. న్యాయ నిర్ణేతల సూచన మేరకు వి.శాంతి ప్రబోధ రచించిన ‘బతుకు సేద్యం’ నవలకు ప్రథమ బహుమతి (రూ.10 వేలు), ద్వితీయ బహుమతిని పి.సుజాత రాసిన ‘పచ్చబొట్టు’ నవలకు (రూ.5 వేలు), విశిష్ట బహుమతిగా ‘నీలంపు రాసి’ నవల రచయిత్రి చంద్రలతను ఎంపిక చేశామని తెలిపారు. వచ్చే నెల ఏడో తేదిన గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో జరిగే వేడుకల సభలో సత్కారం, బహుమతి ప్రదానం చేస్తామని ఆయన వెల్లడించారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్ మూర్తి

కొరిటెపాడు(గుంటూరు): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా విద్యుత్ ప్రమాదాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు తెగిపడితే వాటిని తాకకుండా వెంటనే కంట్రోల్ రూం నంబర్ : 9440817526, టోల్ ఫ్రీ నంబర్ : 1912కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. గుంటూరు సర్కిల్ ఆకార్యాలయం విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని ఆయన సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద మంటలు, శబ్దం వస్తే కంట్రోల్ రూంకు తెలియజేయాలని కోరారు. భారీ వర్షాల కారణంగా తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఇళ్లలో మోటార్ స్విచ్‌లు, విద్యుత్ పరికరాలు వినియోగించేటప్పుడు ప్రమాదాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడి వస్త్రాలు ఆరవేసే తీగలు కరెంట్ స్తంభాలు, తీగలకు తగలకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. తెగిపడిన లైన్లు, పాడైపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సిబ్బంది కూడా తక్షణం మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించాలని ఆయన ఆదేశించారు.

గోవా పోటీలకు గుంటూరు క్రీడాకారుల ఎంపిక

తాడేపల్లి రూరల్ : గోవాలో జరిగే నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ టీమ్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు పవర్ లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తంగా తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మెన్ జూనియర్ బెంచ్ ప్రెస్‌కు రమేష్ శర్మ (జూనియర్), ఉమెన్ బెంచ్ ప్రెస్‌కు కాంతకుమారి (మాస్టర్స్-1), జ్యోతి వర్మ (మాస్టర్స్-2)లు ఎంపికయ్యారని తెలిపారు. మెన్ జూనియర్ 74 కేజీల విభాగంలో రమేష్ శర్మ, 76 కేజీల విభాగంలో కాంతకుమారి, 69 కేజీల విభాగంలో జ్యోతివర్మ ఈనెల 14వ తేదీ నుంచి 18 వరకు గోవాలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు. వీరికి ఫిట్ జోన్ కోచ్ సంధాని శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్, బి. చంద్రిక, భాస్కర్, జాయింట్ సెక్రటరీలు జి. సాయిరేవతి, యస్‌డి. మస్తాన్ వలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎ. పవన్‌కుమార్, పి. సందీప్, జి. నాగమల్లేశ్వరరావు, కె. మధుబాబు, యస్‌కె. సుభాని పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, తెనాలి.

ఆర్.ఓ.సి.నెం.87/2022/ఎ1 తేది: 14-10-2024

బహిరంగ వేలం ప్రకటన

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని దిగువ తెలిపిన షాపు రూములకు సంబంధించిన బహిరంగ వేలము నోటీసు ఈ క్రింద తెలియజేయబడిన విధముగా ది.22-10-2024, మంగళవారము ఉదయం గం.11.00లకు పురపాలక సంఘ కార్యాలయము నందు మున్సిపల్ కమీషనరు గారిచే వారి అనుమతి పొందిన మరి ఏ ఇతర అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం.	వేలం నిర్వహణ అంశము పేరు	ప్రారంభ దరావత్తు రూ.	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ
1	డాక్టర్ రావి రవీంద్రనాథ్ షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.9	10,000/-	1,00,000/-
2	శ్రీమతి ఇందిరాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.7	10,000/-	1,00,000/-
3	డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.27	10,000/-	1,00,000/-
4	ఎ.వి.ఆర్. మునిసిపల్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.7	10,000/-	1,00,000/-

వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పై ప్రకటించిన విధముగా దరావత్తు సొమ్ము, సాల్వెన్సీ ధ్రువపత్రము మరియు ఇ.సి.ధృవ పత్రములు ముందుగా దాఖలు చేసి వేలములో పాల్గొనవలెను. సాల్వెన్సీ ధ్రువపత్రము లేనివారు సాల్వెన్సీ మొత్తమును నగదు రూపములో పురపాలక సంఘమునకు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. వేలం తేదీలు మార్పు చేయు విషయములో కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయ పనివేళల యందు రెవిన్యూ సెక్షన్ నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు, తెనాలి పురపాలక సంఘము

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
పర్చూరు బ్రాంచి (07432), ఫోన్: 8125545465

చివరి ప్రకటన

ఈ క్రింద తెలుపబడిన లాకరు ఖాతాదారుల నుండి చాలా కాలముగా లాకరు రెంటు బాకీ ఉన్నందున మరియు లాకరు ఉపయోగించనందున వారి అందరికి తేది: 02-04-2023, 24-01-2023, 02-04-2022లలో నోటీసులు పంపియున్నాము మరియు తేది : 30-05-2023, 01-02-2023, 02-04-2023న రెండవ నోటీసు మరియు 20-06-2024, 08-06-2023, 20-06-2024న మూడవ నోటీసు మరియు 17-09-2024, 30-05-2023, 17-09-2024న నాల్గవ నోటీసు పంపినను ఎటువంటి స్పందన లేనందు వలన ఈ పత్రికా ప్రకటన చేయటమైనది. ఈ ఖాతాదారులందరూ తేది : 30-10-2025లోగా భారతీయ స్టేట్ బ్యాంక్, పర్చూరు బ్రాంచి నందు సంప్రదించి బాకీ చెల్లించవలసినదిగా కోరడమైనది. లేనిచో తేది : 30-10-2024, ఆ తరువాత లాకరు అగ్రిమెంటు నియమ నిబంధనల ప్రకారం లాకరును బలవంతంగా తెరచి స్వాధీన పరుచుకొనబడును మరియు అందుకు అయ్యే ఖర్చులకు కూడా ఖాతాదారులే బాధ్యత వహించవలెను.

క్రమ సంఖ్య	లాకర్ నెం	ఎస్.డి.వి. నెం	లాకర్ అద్దె బకాయి	లాకర్ యజమానుల పేరు మరియు చిరునామా
1	152	49654227378	6000/-	మాలెంపాటి వెంకటేశ్వర్లు, S/o పున్నయ్య దేవరపల్లి, పర్చూరు. ఫోన్ 8107480505, 9866719681
2	117	49654219731	4500/-	కాకుల శ్రీధర్‌రావు & అరుణజ్యోతి S/o వీరాంజనేయులు, బోడవాడ, పర్చూరు ఫోన్: 81074 77922
3	51	49774388941	7500/-	నిజాంపట్నం వీరాస్వామి S/o అంకమ్మ D.No. 1-113 ఏదుబాడు, పర్చూరు. ఫోన్ 9542114552

తేది : 14-10-2024 సం/- అధీకృత అధికారి